
గుర్రపుడెక్కతో నిండిన సరూర్‌నగర్ చెరువు


ప్రతి వర్షాకాలంలో జాతీయ రహదారిపై ఇలా.. (ఫైల్)

చేసింది గోరంత..ప్రచారం కొండంత

2024లో హామీలతోనే నియోజకవర్గాల అభివృద్ధి | **నెరవేరని డివిజన్ల అభివృద్ధి లక్ష్యం** | **బస్తీలు, కాలనీల్లో కానరాని కనీస సౌకర్యాలు**

2024 రౌండప్

నియోజకవర్గాల్లో అభివృద్ధి ఆమడదూరంలో ఉంటే.. సమస్యలు ఆకాశమంతా పెరిగిపోతున్నాయి. మలక్‌పేట్‌జోన్ పరిధిలోని నియోజకవర్గాల్లో 2024 సంవత్సరం నాయకులకు, ప్రజాప్రతినిధులకు కొంచం ఇష్టం కొంచం కష్టం గడిచిపోయింది. నియోజకవర్గాల్లో గత కొన్ని దశాబ్దాలుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు వేసిన అభివృద్ధి శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి తప్ప అభివృద్ధి అడుగు పడలేదు. మలక్‌పేట్, మహేశ్వరం, యాకత్‌పుర నియోజకవర్గాల పరిధిలో అక్కడక్కడ కొంత అభివృద్ధి జరిగినా పెరుగుతున్న జనాభాకు ఏ మాత్రం సరిపోవడం లేదు. జోన్ పరిధిలోని డివిజన్లలో రెండడుగులు ముందుకు నాలుగడుగులు వెనక్కి అన్న చందనంగా అవినీతి తప్ప అభివృద్ధి జాడ కనిపించడం లేదు. నాయకులు ప్రకటనలకే పరిమితమయ్యారు.

–దిల్‌సుఖ్‌నగర్

కాగితాల్లో మగ్గుతున్న హామీలు..

మలక్‌పేట, మహేశ్వరం, యాకత్‌పుర నియోజకవర్గా ల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందనంగా ఉంది గడిచిన సంవత్సరంలో ఎంతో అభివృద్ధి చేస్తామని హామీలిచ్చిన నాయకులు ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు. కాలనీలలో అక్కడక్కడ కొన్ని అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఆర్‌కేపురం, సరూర్‌నగర్, అక్బర్‌బాగ్, సైదాబాద్, మూసారాంబాగ్, అజంపుర, చంచల్‌గూడ, ఓల్డ్‌మలక్‌పేట్‌లోని డివిజన్లలో కొన్ని అభివృద్ధి పనులు ప్రారంభించినా పూర్తిస్థాయిలో ఇచ్చిన హామీలు అమలు కాలేవు. నాయకులు ఇచ్చిన హామీలు మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. ప్రదాన రహదారుల విస్తరణ, రోడ్ల ఆధునీకరణ, ప్రభుత్వ పాఠశాలకు కనీస సౌకర్యాలు. యువతకు ఉపాధి అవకాశాలు, పేదలకు కనీస మౌళిక సదుపాయాలు. పార్కుల సుందరీకరణ, పేదల ఇళ్ల క్రమబద్ధీకరణ, పట్టాల పంపిణీ ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం ఇలా ఎన్నో హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ ఏడాదిలో హామీలతోనే కాలం గడిపిన నాయకులు నూతన సంవత్సరం నుంచైనా అభివృద్ధి చేస్తారా లేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆయా నియోజవర్గాల్లో ప్రజాప్రతినిధులు ఇచ్చి విస్మరించిన హామీలు ఇవే..

మహేశ్వరం నియోజకవర్గం డివిజన్లలో..

- ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్లలో వందశాతం అభివృద్ధి.
- ఎన్‌టీఆర్‌నగర్ వాసుల ఇళ్ల క్రమబద్ధీకరణ.
- డివిజన్‌లో కనీస మౌలిక సదుపాయాల కల్పన.
- కాలనీల్లో ముంపునకు గురవతున్న ప్రాంతాల శాశ్వత పరిష్కారం.
- ఎన్‌టీఆర్‌నగర్, అంబేద్కర్‌నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పన, బస్తీని అన్ని రకాలుగా అభివృద్ధి.
- ఇంటింటికి కృష్ణాజలాలు, అండర్ డ్రైనేజీ, సీసీరోడ్లు, కమ్యూనిటీహాళ్లు, వరద ముంపు సమస్యల పరిష్కారం.



మలక్‌పేట నియోజకవర్గంలో ...

- నాలుగు దశాబ్దాల కిందట వేసిన అండర్ డ్రైనేజీలను ఆధునీకరించలేకపోయారు.
- రోడ్లను కొంతమేర అభివృద్ధి చేసి వదిలేశారు.
- కాలనీల్లోని కొన్ని పార్కులు చెత్తచెదారంతో దర్శనమిస్తున్నాయి.
- ఇరుకు రోడ్లను విస్తరిస్తామని చెప్పిన ఇంత వరకు అమలుకు నోచుకోలేదు.
- కాలనీలలో ప్రతి ఇంటికి సంవృద్ధిగా తాగునీరు ఇస్తామని చెప్పి ఇంత వరకు దాని ఊసే లేదు.

యాకత్‌పుర నియోజకవర్గంలో..

- యాకత్‌పుర నియోజకవర్గంలోని ఐఎస్‌సదన్, కుర్మగూడ డివిజన్లలో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని అన్న చందనంగా ఉంది. ఈ డివిజన్‌లో నాయకులందరూ హామీలిచ్చేవారే కానీ అభివృద్ధి చేసే వారులేరు.
- ఈ ప్రాంతంలో బస్తీలు, మురికి వాడలు ఉన్న వీటిని పట్టించుకునేవారు కరువయ్యారు. ఈప్రాంత ప్రజలను ఓట్ల కోసం వినియోగించుకుంటారు తప్ప అభివృద్ధిలో మాత్రం భాగస్వామ్యం చేయరు.

బలహీనవార్గల కాలనీలు, బస్తీలు ఏళ్ల తరబడి సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి.


రోడ్ల విస్తరణ లేక మలక్‌పేట్‌లోని ప్రధాన రహదారిపై నిత్యం ఇలా..

సంగెం రమేష్ కుమార్‌కు బెస్ట్ టీచర్ అవార్డు



వనస్థలిపురం: జేఈఈ గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వనస్థలిపురంకు చెందిన సంగెం రమేష్‌కుమార్‌కు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ ట్రైనింగ్ (ఎన్‌ఐఎస్‌టీ) ఆధ్వర్యంలో బెస్ట్ మ్యాథ్స్ టీచర్ అవార్డు దక్కింది. రమేష్‌కుమార్ 2007–2013 వరకు వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన సమయంలో 'ట్రైన్ ద ట్రైనర్' కార్యక్రమంలో భాగంగా అనేక స్ఫూర్తిదాయక శిక్షణ శిబిరాలను నిర్వహించారు. డా. చుక్కా రామయ్య మార్గదర్శకత్వంలో రమేష్‌కుమార్ 'క్వికర్ మ్యాథ్స్' అనే పుస్తకాన్ని రచించి, అనేక మంది విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచే శక్తిని అందించారు. ఆయన విద్యాపరమైన సమర్పణ, ఆవిష్కరణ పద్ధతులు, విద్యారంగానికి చేస్తున్న కృషిని గుర్తించి ఎన్‌ఐఎస్‌టీ బెస్ట్ టీచర్ అవార్డును అందజేసింది.

రెజ్లింగ్‌లో సంకీర్తన్ సత్తా


సిల్వర్ మెడల్‌తో సంకీర్తన్ యాదవ్

చైతన్యపురి: సీనియర్ ఇండియన్ నేషనల్ రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో చైతన్యపురికి చెందిన తోట సంకీర్తన్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించాడు. జై భవాని వ్యాయామశాల గొల్లకిడికి అర్జున్ పహిల్వాన్ ఉస్తాద్‌కు చెందిన సంకీర్త్ తెలంగాణలో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్ పొంది సీనియర్ సౌత్ ఇండియన్ నేషనల్ రెజ్లింగ్ చాంపియన్ షిప్‌కు ఎంపికై 67 కేజీల గ్రీస్ రోమన్ విభాగంలో పోటాపోటీగా జరిగిన పోరులో సిల్వర్ సాధించారు. ఆదివారం చైతన్యపురిలో జరిగిన కార్యక్రమంలో సంకీర్తన్‌ను ఘనంగా సత్కరించారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు


భూపతి గట్టుమల్లు

హస్తినాపురం: మద్యం తాగి వాహనాలు నడపరాదని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు అన్నారు. డిసెంబర్ 31 రోజు మద్యం తాగి వాహనాలతో రోడ్లపైకి వచ్చి హంగామా సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఏడాది డిసెంబర్ 29 వరకు 3132 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. నో పార్కింగ్, ఇతర కేసులు మొత్తం కలిసి నాలుగు లక్షల నమోదు చేశామని డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలుశిక్ష పడిందన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

మలక్‌పేట: ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆదివారం మలక్‌పేట నియోజకవర్గంలో పలు ప్రైవేట్ హాస్టళ్లలో దాడులు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఏ. శ్రుతి ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారంలో బాయ్స్, గర్ల్స్ హాస్టల్‌లో తనిఖీలు చేశారు. పాడైన కూరగాయలు, అపరిశుభ్రమైన గదులు, తాగునీటి ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. సంబంధిత హాస్టళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు


మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సాయి నిఖేష్

చంపాపేట: భారత మాజీ ప్రధాని డా. మన్మోహన్‌సింగ్ మృతి దేశ ప్రజలకు తీరని లోటని జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పసుపులేటి సాయినిఖేష్ అన్నారు. మన్మోహన్ సింగ్ సంతాప దినోత్సవాల సందర్భంగా ఆదివారం చంపాపేట చౌరస్తాలో చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సాయి నిఖేష్ మాట్లాడుతూ..ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దిన ఘనత మన్మోహన్‌సింగ్‌కే దక్కుతుందన్నారు. దేశ ప్రధాని ఆర్థికమంత్రి, రాజ్యసభ సభ్యుడు, వాణిజ్య మంత్రిత్వ శాఖ సలహాదారుడుడిగా ఎన్నో ఉన్నత పదవులు నిర్వర్తించి ఆ పదవులకే వన్నెతెచ్చిన మేధావి అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లా రఘుమారెడ్డి, అశోక్‌గౌడ్, వెంకటరమణారెడ్డి, కిరణ్, సురేందర్, మేఘావత్ గణేష్, జంగయ్య, రాజశేఖర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్, వినయ్‌నగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు వినయ్‌నగర్, కృష్ణానగర్, ఎస్ఎస్ఆర్, బీఎస్ఎన్ఎల్ క్వాటర్స్, చంపాపేట, రెడ్డి కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఆస్మాన్‌గఢ్ డివిజన్ పరిధిలో..

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉ.10 గంటల నుంచి మ. 1 గంట వరకు..
లక్ష్మీనగర్, ఇంద్రప్రస్థకాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పద్మావతి కాలేజ్, సంగం లక్ష్మీబాయి కాలేజ్ , రియాసత్‌నగర్, పిసల్‌బండ క్రాస్ రోడ్.

ఉదయం 10.30 నుంచి 11.30 వరకు..
పద్మావతీ కాలేజ్, ఇంద్రప్రస్థ ఫేజ్–2, సుబ్రహ్మణ్య నగర్, కరణ్‌బాగ్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2.30 నుంచి సా.4.30 వరకు..
ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూ హనుమాన్ టెంపుల్, భవానీ నగర్, ద్వారకాపురి, ప్రతాప్‌నగర్, భాష్యం స్కూల్, యూనిక్ స్కూల్, కాకా హోటల్ అపోజిట్ లేన్, బిలాల్ మజీద్, అలీ హంజా మజీద్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కమనీయం.. రుక్మిణి కల్యాణం


రుక్మిణి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మన్సూరాబాద్: వైదిక విజ్ఞాన ట్రస్ట్, ధర్మరక్ష సంస్థ సంయుక్తాధ్వర్యంలో నాగోలు డివిజన్ పరిధి జనప్రియ ఎన్‌క్లేవ్ కాలనీలో జరుగుతున్న పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు రుక్మిణి కల్యాణాన్ని వేద పండితులు కనుల పండువగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతితో మహోత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషిచేస్తా


సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో కన్వీనర్‌గా రిటైర్డ్ లైబ్రేరియన్ కే.వీరప్పను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సైదాబాద్: ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 27న ఉదయం 8 గంటలకు సక్సెస్ స్కూల్ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు (60) అపస్మారక స్థితితో పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అతడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా 5కే రన్

మన్సూరాబాద్: వనస్థలిహిల్స్‌లో ఆదివారం ఎల్‌బీ నగర్ రన్నర్స్(వాకర్స్) వార్షిక 5కే రన్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. కార్తిక్, జగదీష్‌యాదవ్ నేతృత్వంలో జింకల పార్కు మన్సూరాబాద్ గేట్, సాంబ నేతృత్వంలో ఆటోనగర్ జింకల్‌పార్కు ప్రధాన గేట్, శేఖర్ పన్నాల ఆధ్వర్యంలో మన్సూరాబాద్ పెద్దచెరువు వాకర్స్ పెద్ద ఎత్తున 5కే రన్‌ను తరలివెళ్లారు.



ఈడబ్ల్యూఎస్ కోటాను ఎత్తివేయాలి


గంజి ఉదయ్ ముదిరాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న పెద్దవూర బ్రహ్మయ్య తదితరులు

నాగోలు: ఈడబ్ల్యూఎస్ కోటాతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం కొత్తపేటలో బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన గంజి ఉదయ్ ముదిరాజ్‌కు బీసీ కులాల ఐక్యవేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించి బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దవూర బహ్మయ్య మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగాల్లో ఈడబ్ల్యూఎస్ కోటాను 10 శాతం అమలు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. బీసీ కులాల ఐక్య వేదిక నాయకులు వినయ్ కుమార్, అరవింద్, మధు, జగదీష్, ప్రదీప్, యాదయ్య, రాము లాల్, వెంకటేష్, లక్ష్మయ్య, సైదులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడే పార్టీ సీపీఐ ఒక్కటే


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న పాలమాకుల జంగయ్య

దిల్‌సుఖ్‌నగర్: సమాజ నిర్మాణం, పీడిత వర్గాల హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న పార్టీ సీపీఐ ఒక్కటే అని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా సరూర్‌నగర్, ఆర్‌కేపురంలో ఆదివారం బాతరాజు నరసింహ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జంగయ్య పాల్గొని పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూస్వాములపై పోరాటం చేసి పది లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేసిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. దేశంలో అధికారం ఉన్నా లేకున్నా నేటికీ నిరంతరం ప్రజల హక్కుల కోసం లాఠీలు తూటాలు జైళ్లను సైతం లెక్కచేయకుండా పోరాటం చేస్తున్నారన్నారు. డిసెంబర్ 30న నల్లగొండలో ఎన్‌జీ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు రంగారెడ్డి జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ.. దేశంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ఎర్ర జెండా పార్టీల చరిత్ర లేకుండా చేయాలని చూడటం బీజేపీ తరం కాదన్నారు. ఈ కార్యక్రమంలో పానుగంటి పర్వతాలు, ప్రవీణ్ కుమార్ గౌడ్, శేఖర్ రెడ్డి, ఎండీ ఫైమీద, క్రాంతికుమార్, కమలమ్మ, సుధాకర్, రాములు గౌడ్ నర్సిరెడ్డి, ఆర్ కరుణాచారి, గంగాధరి శ్రీనివాస్, లింగస్వామి, శోభ, అనిత, పార్వతమ్మ పాల్గొన్నారు.

సీపీఐ దిమ్మె ధ్వంసం.. ఫిర్యాదు

సైదాబాద్: సీపీఐ పార్టీ దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ మేరకు సీపీఐ ఐఎస్‌సదన్ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ ఆదివారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ శత వసంతాల వేడుకల్లో భాగంగా సిటీకేఫ్ చౌరస్తాలోని పార్టీ దిమ్మెకు ఇటీవలే రంగులు వేయించామని తెలిపారు. శనివారం అక్కడ పార్టీ జెండా ఎగురవేయడానికి పార్టీ నాయకులతో కలిసి వెళ్లగా.. దిమ్మె పాక్షికంగా దెబ్బతిని కనపడిందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దిమ్మెను ధ్వంసం చేయడానికి యత్నించినట్లు తెలుస్తోందని తెలిపారు. సైదాబాద్ పోలీసులు ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

హామీల అమలుకు ప్రభుత్వం కృషి


దేప భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్సీసెల్ ప్రెసిడెంట్ క్యారగారి శ్రీధర్

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రెసిడెంట్‌గా క్యారగారి శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం దేప భాస్కర్ రెడ్డిని కలిసి సన్మానించారు. ఉపేందర్ రెడ్డి, గణేష్ నేత, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధుసూదన్ రావు, వెంకటేష్ గౌడ్, జంగయ్య, పవన్, భిక్షపతి, దయాకర్, నర్సింగ్, వినయ్, విప్లవ రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నాగోలు: నల్లగొండలో సోమవారం జరిగే సీపీఐ వంద సంవత్సరాల శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మోహన్‌నగర్ శాఖ కార్యదర్శి మల్లేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తపేట డివిజన్ న్యూ నాగోల్‌లోని ఎస్ఏ డాంగే భవన్‌లో మోహన్ నగర్ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జైపురి కాలనీ కార్యదర్శి ఎండీ బషీర్, ఉప్పల్ మండల కౌన్సిల్ సభ్యులు రాసమల్ల రాజేందర్, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

వీరన్నగుట్ట క్షేత్రంలో ప్రత్యేక పూజలు


అభిషేకం, హోమంలో పాల్గొన్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: పవిత్ర క్షేత్రం వీరన్నగుట్ట క్షేత్రమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టలోని రామాలయంలో హనుమాన్ అభిషేకం, గణపతి పూజ, హోమం కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. హనుమాన్ దీక్షా స్వాములతో కలిసి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. వీరన్నగుట్ట క్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి పర్వదినమున లక్షల సంఖ్యలో భక్తు లు పాల్గొనే విధంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. హనుమాన్ దీక్షా స్వాములు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పండుగలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

మలక్‌పేట: పండుగలు, ఉత్సవాలు ప్రజల మధ్య స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ భొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అన్నారు. మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సలీం నగర్ బాలదానమ్మ బస్తీ కమ్యూనిటీహాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ క్రిస్మస్ ప్రేమ విందుకు హాజరయ్యారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రహం, కార్యదర్శి శ్రీధర్, పాస్టర్ ఇర్మియా, క్రైస్తవ సంఘాల నేతలు జరూసలేం మత్తయి, డెవిడ్, క్రైస్తవులు పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్

హస్తినాపురం: ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికికృషి చేస్తామని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నీలా మధుసూదన్ గుప్తా ఆధ్వర్యంలో నూతన సంవత్సరం కేలండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పొలిటికల్ కమిటీ చైర్మన్ చింతల రవికుమార్‌గుప్తా, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తాడపల్లి వెంకటేశం గుప్తా, కోశాధికారి కె.కిరన్ గుప్తా, కాసుల శ్రీనివాస్ గుప్తా, బిజ్జాల వేణుగుప్తా, బండారు సుధాకర్, భాస్కర్, కొమిరిశెట్టి గణేశ్, రవీందర్, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.